క్లుప్తంగా

తీరంలో వనాలు కనుమరుగు


తీరంలో సరుగుడు చెట్లు నరికివేసిన దృశ్యం

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామ సముద్ర తీరంలో వనాలు కనుమరుగవుతున్నాయని ఎంపీటీసీ ప్రతినిధి బైపల్లి తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ సిబ్బందికి శనివారం వినతిపత్రం అందజేశారు. సముద్ర తీరానికి సుమారు 100 మీటర్ల దూరంలో ఉన్న చెట్లను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, తమ సొంత భూముల్లో ఉన్నాయని చెబుతూ నరికి రవాణా చేసుకుంటున్నారన్నారు. తీరానికి దగ్గరలో ఉన్నటువంటి చెట్లను నరికితే తుఫాన్లు వచ్చే సమయాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. అధికారులు స్పందించి చెట్లు నరికి రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ తడక యశోద

సోంపేట: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెడ్పీటీసీ తడక యశోద అన్నారు. మండలంలోని పలాసపురం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంత స్థలాన్ని పరిరక్షించాలని వినతి

కంచిలి: మండలంలోని అంపురం పంచాయతీ ఎస్.ఎం.పురం రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నటువంటి ఆదివారం సంత స్థలాన్ని పరిరక్షించాలని అంపురం పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు పంచాయతీ పెద్దలంతా కలిసి తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సంత స్థలాన్ని పూర్వం వివిధ గ్రామాలకు చెందిన రైతులు కేటాయించారని, తర్వాత వారు మృతి చెందారన్నారు. అయితే ప్రస్తుతం వారి వారసులు ఆ స్థలాన్ని తిరిగి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని వాపోయారు. రెవెన్యూపరంగా ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో మద్ది అప్పారావు, ఉప సర్పంచ్ కేశవరావు, మునకాల పోలయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ గ్రామానికి చెందిన వెంకటరావు రౌలో భార్య విష్ణమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. అసలే పేదరికం, ఆపై వెంకటరావుకు కళ్లు కనిపించకపోవడంతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. దీంతో కొఠారీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి స్పందించారు. శనివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.6 వేల ఆర్థిక సాయమందించారు.

ఏడుగురు ఆయాల నియామకం

కాశీబుగ్గ: మందస ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఏడుగురు ఆయాలకు నియామక పత్రాలను సీడీపీవో వసుందర దేవి శనివారం అందజేశారు. అంతకుముందు ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న ఆయాల పోస్టుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, రట్టి లింగరాజు, తమిరియా భాస్కరరావు, రాజన మహేష్, మంగళపాత్రో, సవర శంకరరావు పాల్గొన్నారు.

నిషిద్ధ కర్మలకు దూరంగా ఉండాలి

కాశీబుగ్గ: ప్రతి ఒక్కరూ నిషిద్ధ కర్మలకు దూరంగా ఉండాలని రిషికేష్‌కు చెందిన వేదాత్మానంద మాతాజీ అన్నారు. కాశీబుగ్గలో తెలుగు రాష్ట్రాల 49వ దివ్య జీవన మహాసభలు రెండో రోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనసుకు ఆధ్యాత్మికతతో మాత్రమే చికిత్స చేయగలమన్నారు. వచ్చే ఏడాది 50వ మహాసభలు తిరుపతి క్షేత్రంలో నిర్వహణకు ముందుకు వచ్చారని తెలిపారు. అనంతరం భగవద్గీత పారాయణం సామూహికంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కేవీ రామకృష్ణ, అధ్యక్షుడు పైడిశెట్టి అశోక్‌కుమార్, కార్యదర్శి పెంట సత్యనారాయణ, కోశాధికారి కొత్తకోట మురళి తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు దూరం.. ఇంకెంతకాలం..?

- ఎన్నికల హామీలపై దృష్టి సారించని ప్రభుత్వం
- పథకాల కోసం ప్రజల ఎదురుచూపులు
- రేషన్ కార్డులు మంజూరవ్వక ఇబ్బందులు


గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారం చేపట్టిన తర్వాత పథకాల ఊసెత్తడం లేదు. దీంతో తమకు మంచి చేస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. గత ప్రభుత్వ హయాంలో అందిన సంక్షేమ పథకాలు ప్రస్తుతం అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలవుతున్నా పథకాల అమలుపై కనీసం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ పంటకు సంబంధించి పెట్టుబడి సాయం అందించలేదు. ఈ విద్యా సంవత్సరంలో తల్లికి వందనం అమలు ఆచరణ శూన్యంగానే కనిపిస్తోంది. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఎండమావిగా మారింది. ఇలా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గాలికొదిలేయడంతో అనేక ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ'రేషన్'

పేద, మధ్య తరగతి కుటుంబాలకు రైస్ కార్డే ప్రధాన ఆధారం. దీని ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిఏటా జూన్, డిసెంబర్ నెలల్లో రేషన్ కార్డులు అర్హులకు అందజేసేది. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో గంటల్లో రేషన్ కార్డులు ఇచ్చిన రోజులు కూడా ఉన్నాయి. కొత్తగా వివాహం చేసుకున్న జంటలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు వచ్చిన ఏ ఆధారం లేని కుటుంబాల వారు కూడా దరఖాస్తుదారుల్లో ఉన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొత్త కార్డులపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం నూతన దరఖాస్తుదారులను ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు వెబ్‌సైట్ సైతం పనిచేయకపోవడం గమనార్హం.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో...	
రేషన్ దుకాణాలు	192
ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులు	92,461
గత ప్రభుత్వంలో మంజూరైన కార్డులు	3,250
కొత్త రేషన్ కార్డుల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు	1,760


రేషన్ కార్డులు


గత ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులు

ఉత్తర్వులు రాలేదు



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత గతేడాది ఏప్రిల్ 18 నుంచి ప్రభుత్వ సైట్ ఓపెన్ కావడం లేదు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఇప్పటికే చాలా మంది రేషన్ కార్డులకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసి ఉన్నారు. ప్రభుత్వ సైట్ ఓపెన్ అయితే రేషన్ కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– ఎస్.వెంకటరావు,
తహసీల్దార్, ఇచ్ఛాపురం మండలం

ప్రమాదకరం



బస్సు పుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయడం ప్రమాదమని తెలిసినా కొంత మంది యువకులు అదే మాదిరిగా ప్రయాణాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. టెక్కలి జాతీయ రహదారి పరిధిలో ప్రతిరోజూ విద్యార్థులు ఇలా పుట్‌బోర్డు ప్రయాణాలు చేయడం సర్వసాధారణంగా మారిపోయింది. దీంతోపాటు ప్రయాణంలో కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు జాగ్రత్తగా ప్రయాణాలు చేయడం మంచిదని పలువురు సూచిస్తున్నారు.

– టెక్కలి

తప్పెటగుళ్ల ప్రదర్శన



కడపలో జరిగిన శ్రీరామ మహా శోభాయాత్రలో మన జిల్లా కళాకారులు తప్పెటగుళ్ల ప్రదర్శన ఇచ్చారు. కడప మున్సిపల్ క్రీడా మైదానంలో అయోధ్య ఐక్యవేదిక సభ్యులు నిర్వహించిన సీతారాముల కల్యాణంలో భాగంగా శోభాయాత్రలో పానిల శంకరరావు తప్పెటగుళ్ల బృందం ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ప్రదర్శనలో పలాస మండలం కొమలాపురం, రేగులపాడు, టెక్కలిపట్నం గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన తప్పెటగుళ్ల కళాకారుల బృందం పాల్గొంది. దీనిలో సుమారు 25 మంది కళాకారులు వివిధ రకాల విన్యాసాలతో పాటు చక్కనైన గానాలాపనతో అలరించారు.

– కాశీబుగ్గ

ఆకట్టుకున్న వేషధారణలు



కవిటి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటికి చెందిన కల్యాణి పాఠశాల చిన్నారులు దేశ నాయకుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. అలాగే పట్టణ వీధుల్లో చైతన్య ర్యాలీ నిర్వహించారు.

– కవిటి

కూటమి అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అక్రమాలపై జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ వెల్లడించారు. శనివారం టెక్కలి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కూటమి కార్యకర్తలు చేస్తున్న అక్రమాలపై ప్రతీనెలా నాలుగో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అలాగే మండల స్థాయిలో ఫిర్యాదులు, సమస్యలను ఆర్డీవో విన్నవిస్తామన్నారు. అదేవిధంగా ప్రతీనెల 21వ తేదీన టెక్కలి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీలో అనుబంధ కమిటీల నియామకాలకు నాయకులంతా సహకరించాలని కోరారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులకు ఇబ్బందులు కలిగే విధంగా కూటమి నాయకులు ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారి సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ డి.వెంకట్రావు, నాయకులు హెచ్.వెంకటేశ్వరరావు, ఆర్.మల్లయ్య, బి.నాగేశ్వరరావు ఎ.రామారావు, కె.బాలకృష్ణ, కె.సంజీవ్, ఎస్.సత్యరాజ్, ఎస్.భీమారావు, బి.మోహన్‌రెడ్డి, కె.జగన్నాయకులు, ఎం.శంకర్, పి.వెంకట్రావు, కె.జీవన్, పి.రమణబాబు, కె.నారాయణమూర్తి, టి.రాజు తదితరులు పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ


బాబూరావును పరామర్శిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

నందిగాం: మండలంలోని వల్లభరాయుడుపాడుకు చెందిన బొంగి బాబూజీ, వాసుదేవరావుల తండ్రి రాజారావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. అలాగే మండలంలోని కొండపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెండి బాబూరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్ని జోగారావు, బైరాగి, ఆరంగి వేణు తదితరులు ఉన్నారు.

బాలల సంరక్షణే ధ్యేయం


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంచిలి: బాలల సంరక్షణే చైల్డ్ హెల్ప్‌లైన్ ధ్యేయమని చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ ఆర్.జాస్మిన్ కుమారి అన్నారు. సోంపేట రైల్వేస్టేషన్ ఆవరణలో చైల్డ్ హెల్ప్ డెస్క్ టీమ్ సభ్యులు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు ఉండే బాలలకు రక్షణ అవసరమైతే 1098కు సమాచారం అందించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ శంకర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షురాలిగా సుజాత


ఎఫ్‌పీవో నూతన కార్యవర్గం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షురాలిగా బర్ల సుజాతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆ సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా బీవోడీ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. దీనిలో భాగంగా ఉపాధ్యక్షుడిగా దున్న రాజారావు, కార్యదర్శిగా బత్తిన హేమ, జాయింట్ సెక్రటరీగా లండ భోజరాజు, కోశాధికారిగా పోతనపల్లి పద్మావతిలను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన నూతన కార్యవర్గం ఎఫ్‌పీవో అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎం గొడబ ప్రసాదరావు కోరారు. కార్యక్రమంలో సీసీ హరిప్రియ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

టెక్కలి రూరల్: స్థానిక బాలికోన్నత పాఠశాలకు ఉపయోగపడే విధంగా ఉండేందుకు గాను రెండు సౌండ్ బాక్సులతో కూడిన మైక్‌సెట్‌ను టెక్కలికి చెందిన అభయం యువజన సేవాసంఘం సభ్యులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.శోభరాణికి శనివారం అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి


మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పిరియా విజయ

సోంపేట: కంచిలి మండలం జలంత్రకోట సమీపంలో జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బారువ గ్రామానికి చెందిన యువకులు హరీష్ పాణిగ్రాహి, అనిల్ పాణిగ్రాహిల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. శనివారం ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌తో కలిసి బారువ గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆమెతో పాటు బారువ సర్పంచ్ యర్ర రజని, పార్టీ నాయకులు భువనేశ్వర్ పాణిగ్రాహి, కర్రి సత్యం, అమర లోకనాథం, శంకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం కూర్మనాథపురంలో యువత స్వచ్ఛందంగా శనివారం రక్తదానం చేశారు. 33 మంది యువకులు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తాన్ని అందించారు. తలసేమియా చిన్నారులకు తమ వంతుగా సాయం అందించాలనే ప్రయత్నంలో భాగంగా ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకుడు కీలు విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తిని తిరుపతి, ఉపాధ్యక్షుడు కొయ్యిల చంటి, ఇన్‌చార్జి కీలు కమల, అర్జి గిరి, గర్తం ప్రకాష్, పుష్ప, దున్న సావిత్రి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) సర్వే నెం.594/A, శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, కేసరిపాడు పంచాయతీ, శ్రీకాకుళం జిల్లా, 1225 Sq.Mts (35x35) కొలిచే సైట్ యార్డ్‌లో రిటైల్ అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. సైట్ సరిహద్దులు ఉత్తర– మతులక మెట్టు తోట, పశ్చిమ – గార కేశవరావు మెట్టు తోట, తూర్పు – జాతీయ రహదారి 16, దక్షిణ–గార కేశవరావు మెట్టు తోట. శ్రీకాకుళం జిల్లా, కంచిలి మెయిన్ రోడ్డులోని నర్సన్నముకుందపురం గ్రామానికి చెందిన ఆశా గుప్తా W/o కిషన్ సరూప్ గుప్తా అనే నుండి భూమిని లీజుకు తీసుకున్నాడు. AP (వ్యవస్థీకృత లేదా అసంఘటిత) పేర్కొన్న ఆస్తిపై ఏదైనా హక్కు లేదా క్లెయిమ్ కలిగి ఉంది, ఆ తేదీ నుండి 7 రోజులలోపు వారి క్లెయిమ్‌కు మద్దతు ఇవ్వడానికి సంబంధిత మరియు అవసరమైన శీర్షిక గల డాక్యుమెంట్‌లతో పాటు క్రింద పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవచ్చు.

నోటీసు సంప్రదింపుల కోసం:
టెరిటరీ మేనేజర్ (రిటైల్ వైజాగ్), **భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్.,**
పబ్లిక్ నోటీసు వైజాగ్ ఇన్‌స్టాలేషన్, ధనారెడ్డి గోడౌన్ల దగ్గర, PO నేవల్ బేస్ విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, మొబైల్ నెం.9437080856.
ఇమెయిల్: ankitmahapatra@bharatpetroleum.in
తేదీ: 24-01-2025, స్థలం: కంచిలి

ఓటే వజ్రాయుధం


టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ తదితరులు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని వక్తలు పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. యువత తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల వలనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కవిటి: మానవహారంలో వివిధ కళాశాలల విద్యార్థులు


కంచిలి: విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్న అధికారులు


సోంపేట: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు


ఇచ్ఛాపురం: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓటర్ల దినోత్సవం


ఇచ్ఛాపురం రూరల్: కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేస్తున్న అధికారులు


సంతబొమ్మాళి: బోరుభద్ర ఉన్నత పాఠశాలలో ఓటు విలువ తెలుపుతూ విద్యార్థుల ప్రదర్శన


నందిగాం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు రూరల్: ఓటుహక్కుపై అవగాహన కలిగిస్తున్న రెవెన్యూ అధికారులు